

# కథ

**శంకర్ నూతేటి**

# శుభ'లేఖ'లు

"ప్రియమైన అమ్మా నాన్నలకు,

మీ ముద్దుల అబ్బాయి కామేశ్వరరావు వ్రాయునది.

నేను కుశలము. మీరూ కుశలము అని తలుస్తాను. కొత్తగా ట్రాన్స్‌ఫర్ అయిన ఊరు చాలా బాగా నచ్చింది. వచ్చినప్పటి నుండి ఏ ఇబ్బందీ కలగలేదు. ఇంటి ఓనరు చాలా మంచివారు. మంచి అభిరుచి, సనాతన భావాలు కల మనిషి. చుట్టూ కొండలు.. మధ్య ఓ యాభై ఇండ్లు, కొంచెం దూరంగా యేరు. ఎంతో ఆహ్లాదకరమైన ఊరు. ఒసే... నానమ్మా! బెంగపెట్టుకోకు. ఇక్కడ అంతా బాగా ఉంది. ఈసారి వచ్చినప్పుడు నీ కళ్లద్దాల గ్లాసులు మార్పిస్తాను. ఈమధ్య దాశరథి రాసిన వేదాలు చదవడం మొదలెట్టాను. ఎంతో అర్థాన్నిస్తున్నాయి.. అవునూ! నా మల్లి చెట్టు పూలు పూసిందా....! సీతమ్మ మడుగులో నీళ్లు తగ్గాయా! అమ్మాయి విషయం ఏమైంది, ఆ వెంకట్రామయ్యగారు ఒత్తిడి తెస్తున్నారు అని వ్రాశావు పోయినసారి. మంచి అమ్మాయి దొరకగానే నేనే తెలియజేస్తాను. ఆ వెంకట్రామయ్యగారి సంబంధం ఇష్టం లేదని చెప్పేయండి. ఈ లెటరు ఎందుకు ఫోన్ చేయొచ్చు కదా! అని మళ్లీ మళ్లీ అడగవద్దు. అమ్మా! నీ నోటి ముత్యాలు లెటరులో ఏరుకొంటున్నాను కదా!

అన్నట్టు అడగడం మర్చిపోయాను. చంటోడు స్కూల్‌కి వెళ్తున్నాడా?

అన్ని విషయాలతో లెటరు వ్రాయండి.

ఇట్లు

మీ అబ్బాయి కామేశ్వరరావు"

"ప్రియమైన మిత్రుడు శ్రీనుకి,

నీ మిత్రుడు కామేశ్వరరావు వ్రాయునది... నేను క్షేమం. నీవు క్షేమమని తలుస్తాను. నాకు ట్రాన్స్‌ఫర్ అయిన ఊరు చాలా బాగా నచ్చింది. ఓ నలభై మంది విద్యార్థులు ఉన్నారు మా స్కూల్‌లో. ఇంటి ఓనరు కూడా చాలా మంచివారు. అభ్యుదయ భావాలున్న మనిషి, విషయమేమిటంటే ఇంటి ఓనరుగారి అమ్మాయి పరిచయం అయింది. పేరు కోకిల. మంచి చురుకుదనం, క్రియేటివిటీ ఉన్న అమ్మాయి. పరిచయం అయిన రోజునే 'ఏమండీ.. ఈవేలంటే కడపటిది, పదవినోదం చెప్పండి' అని అడిగింది. చెప్పాననుకో! ఎంత చొరవ. చదువు కొంది కూడా. నాకు అన్ని విధాలుగా నచ్చింది. వారం క్రిందట ధైర్యం చేసి 'నిన్ను ఇష్టపడుతున్నాను' అని చెప్పాను. ఓ నాల్రోజులు టైము తీసుకుని తను కూడా ఒ.కే. అనేసింది. ఇప్పుడు మేం ప్రేమికులమే కాదు మంచి స్నేహితులం కూడా. చాలా చలాకీ మనిషి. నన్ను ఆటపట్టిస్తుంది. అభిమానిస్తుంది. అల్లరి చేస్తుంది. త్వరలో కోకిల తల్లిదండ్రులతో మాట్లాడుదామనుకొంటున్నాను. ఇంట్లో అమ్మవాళ్లతో కూడా ఇంకా చెప్పలేదు. దీని మీద నీ అభిప్రాయం కూడా ఉత్తరంలో వ్రాయి. ఇంతకూ నీకు ట్రాన్స్‌ఫర్ అయిన ఊరు ఎలా ఉంది? శాంతి ఊరెళ్లింది అన్నావు వచ్చిందా! అన్ని విషయాలతో ఉత్తరం వ్రాయి.

ఇట్లు

నీ మిత్రుడు కామేశ్వరరావు"

* * *

టక్..టక్...మన్న శబ్దం విని క్రింద బెడ్ మీద పడుకొని ఉన్న కామేశ్వరరావు నిద్ర లేచి కళ్లు నలుపుకుంటూ ఊడిపోతున్న లుంగీని కట్టుకుని తలుపు తీశాడు. ఎదురుగా కోకిల కాఫీ కప్పుతో. తల విదిలించి కళ్లు నలుపుకున్నాడు ఆ అందానికి. తలస్నానం చేసి కురులు విరబోసుకుని ఉంది. "ఒక్క నిమిషం, అక్కడే కదలకుండా అలాగే ఉండు. ఆ...ఆ...మీ అందాన్ని వివరించనా" అన్నాడు కామేశ్వరరావు.

".. వివరించు చూద్దాం" అంది కోకిల. "పట్టపగలు ఎవరైనా రాతిరిని చూశారా... తన కురులు చూపిస్తా అవుననక చస్తారా" అనే పాటను కురులు చూసి వర్ణించుంటారు. ఎప్పుడో నీ కళ్ల సంతతి అయి ఉంటాయి ఆ గండుమీనాలు. ఈ ముక్కు మాత్రం వ్యవసాయదారునికి అరువు ఇచ్చిందే కోటేరు కోసం. ఉండు.. ఉండు ఇటు తిరుగు అర్జునుడు నీ పెదవులను చూసి విల్లును తయారు చేసుకొని ఉంటాడు. అందుకే ఆ విల్లుకి అంత పవర్. ట్యూబ్‌లైట్ లేకపోయినా పర్వాలేదు. నీ బుగ్గల షైనింగ్ ఉందిలే. కందిరీగ మీ బంధువే కదా! ఆ నడుముని చూస్తేనే తెలుస్తుంది. ఇకపోతే "ఏయ్..." అని చప్పున నోరు మూసింది.

"అయ్యగారు కవితా హృదయులే" అంది కాఫీ అందిస్తూ.

"ఇంత పొద్దెక్కేదాకా నిద్రపోయేవాడివి రేపు పెళ్లి అయితే ఏం సంసారం చేస్తావో.. ఏమో.. నీతో కష్టమే" అంది కోకిల.

"నీవు ఉన్నావుగా సంసారం చేయించడానికి" అంటూ ఒడిలోకి లాక్కొన్నాడు కామేష్ కాఫీ కప్పు క్రింద పెడుతూ.

"వదులు కామూ" అంది ఇష్టంగానే.

"వదలను, అవునూ ఏరోజూ లేనిది ఈ రోజు కాఫీతో ప్రత్యక్షమయ్యారు" అన్నాడు కామేష్ చేతిలో చెయ్యి వేస్తూ కొంటెగా.

"నాన్నగారు ఊరెళ్లారు. అది సరే మీ అమ్మా నాన్నలతో చెప్పవా కామూ మన ప్రేమ గురించి" అడిగింది కోకిల కామేశ్వరరావుని.

"లేదు అయినా మా ఇంట్లో మన పెళ్లి గురించి ప్రోబ్లమ్ లేదు, మీ ఇంట్లోనే కాబట్టి వీలైనంత త్వరగా మీ అమ్మా నాన్నలతో మాట్లాడతాను" అని బుగ్గమీద చిటికె వేశాడు కామేష్.

"ఇక చాలు వదులు కామూ" అంది కోకిల.

"వదలను కాక వదలను. అయినా ఎప్పుడో ఒకప్పుడు మనం ఇలా దగ్గరవ్వాల్సిందే కదా!" అంటూ ఇంకా దగ్గరకు లాక్కోబోయాడు.

"వదులు నీక్కాదు చెప్పేది" అంది సీరియస్‌గా తల పైకెత్తి కళ్లలోకి చూస్తూ.

ఉలిక్కిపడి వదిలేశాడు కామేశ్. సీరియస్‌గా వెళ్లిపోయింది. వెళుతూ.. వెళుతూ "మా నాన్న ఊరెళ్లింది ఎందుకో తెలుసా? నాకు పెళ్లి సంబంధం మాట్లాడడానికి" అంది కోకిల.

మళ్లీ మరో షాక్ కామేష్‌కి. పెళ్లి సంబంధం అంటుందేమిటి? ఇక లాభం లేదు. రేపే కోకిల నాన్నతో మాట్లాడాలి అని నిర్ణయించుకున్నాడు కామేష్. త్వరగా రెడీ అయ్యి రెండు మూడు సార్లు ప్రయత్నించాడు కోకిలతో మాట్లాడడానికి. వీలు కాలేదు. స్కూల్‌కి టైం అయ్యేసరికి వెళ్లిపోయాడు అని నిర్ణయించుకున్నాక బయటకు వచ్చి చూసి నవ్వుకుంది కోకిల.

సాయంత్రం స్కూల్ నుండి రాగానే కోకిల కోసం వెతికాయి కామేశ్వరం కళ్లు. కనబడలేదు. "అబ్బాయి కామేషూ! అమ్మాయి నీతో ఏదో మాట్లాడాలంట మేడ

మీద వెయిట్ చేస్తూ ఉంది నీ కోసం" అన్నాడు కోకిల తండ్రి పేపరులోంచి తల ఎత్తకుండానే.

'కొంపదీసి వాళ్ల నాన్న పెళ్లి సంబంధం ఖాయం చేసుకువచ్చాడా! లేక మా ప్రేమ విషయం చెప్పేసిందా! ఈ పిచ్చిపిల్ల టెన్షన్ పెట్టి చంపుతూ ఉందే' అని ఆలోచనలో పడ్డాడు.


"అబ్బాయ్ నిన్నే" అని మళ్లీ పిలిచే సరికి ఈ లోకంలోకి వచ్చి "సరేనండి" అని కొంత వినయాన్ని ప్రదర్శించి మెల్లగా అడుగులు వేసుకుంటూ ఇక ఆయనకి కనపడదు అని నిర్ణయించు కొని పరుగెత్తాడు మేడపైకి.

"పెళ్లి సంబంధం చూడటానికి వెళ్లాడు మా నాన్న అన్నావు ఏంటి" అని అడిగాడు కామేషు ఆతృతగా.

"అవును పెళ్లి సంబంధమే నిశ్చ యించుకున్నాం కూడా" అంది కోకిల.

"జోకులు వెయ్యవద్దు కోకిల, నేను సీరియస్‌గా మాట్లాడుతున్నాను" అన్నాడు కామేషు.

"జోకులు కాదు కామేష్. నేను కూడా సీరియస్‌గానే మాట్లాడుతున్నాను. అది సరే ఈ లెటర్ ఏంటి" అంటూ ఓ లెటర్ అందించింది కోకిల కామేశ్వరానికి. అది వాళ్ల బామ్మ వ్రాసినది. ఉత్తరం వైపు, ఆమె వైపు మార్చి, మార్చి చూశాడు. చదువు అన్నట్లు నొసలు ఎగరవేసింది కోకిల. అక్షరాల వెంట పరుగెత్తడం మొదలుపెట్టింది అతని దృష్టి.



"చిరంజీవి కామేశ్వరానికి-

మీ నాన్నమ్మ ఆశీర్వదించి వ్రాయునది ఓరి భడవా! మాకు చెప్పకుండా ఒకేసారి కాబోయే మీ మామగార్ని ఇంటికి పంపుతావ్రా! సంబంధం మాట్లాడడానికి. ముందుగా చెపితే ఏర్పాట్లు అవీ చేసేవాళ్లం కదా! ఈవేళ కాబోయే మీ మామగారు తీసుకు వచ్చిన ఫోటో చూశాము. అమ్మాయి బాగుంది. మీ అమ్మకు కూడా నచ్చింది. అయినా నీకు నచ్చింది కదా! అదే పదివేలు. ఇన్నాళ్లకయినా ఓ అమ్మాయిని చూసుకున్నావు సంతోషం. మీ మామగారు కూడా 'అబ్బాయి నచ్చాడు' అన్నాడు. ఇకపోతే వచ్చే శ్రావణమాసంలో దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయంట. ముహూర్తం కుదిరిన తరువాత తెలియజేస్తాము. అంతవరకు వెధవ వేషాలు వెయ్యకుండా ఉండు.

అన్నట్లు నీ మల్లిచెట్టు తొలిమొగ్గ వేసిందిరా! దాన్ని రాములవారి పాదాల దగ్గర ఉంచానులే!

ఇంతే సంగతులు

ఇట్లు

మీ నాన్నమ్మ"

చదివాక ఆశ్చర్యంతో కోకిలవైపు చూశాడు.

"దీన్నిబట్టి అర్థమైంది ఏంటంటే నీకు ఇంకొక గర్ల్‌ఫ్రెండ్ ఉంది. నాకు తెలియకుండానే ఆ అమ్మాయి వాళ్ల నాన్నని మీ ఇంటికి పంపి పెళ్లి నిర్ణయించుకున్నారు" అంది కోకిల.

"లేదు కోకిల, నాకు గర్ల్ ఫ్రెండ్ లేదు, నేను కాబోయే మామ గార్ని పంపలేదు. నన్ను నమ్ము కోకిల" అన్నాడు కామేశ్ ఆశ్చర్యంతో అభ్యర్థనగా.

"సరే నిన్ను


నమ్ముతాను, మీ నాన్నమ్మ రాసిన లెటర్ తప్పంటావ్ అంతేనా" అంది కోకిల.

కామేశ్వరరావుకి ఏమీ అర్థం కావడం లేదు. ఇవి నాన్నమ్మ అక్షరాలే. నాన్నమ్మ ఎందుకిలా రాసింది అని ఆలోచిస్తూ బిక్కమొహం వేసేసరికి, నవ్వుతూ దగ్గరకి వచ్చి ఇంకొక లెటర్ అందించింది.

ఆశ్చర్యంతో "ఇదేంటి" అన్నాడు కామేశ్వరరావు.

"చదువు" అంది కోకిల.

మళ్లీ అక్షరాల వెంట పరుగులు తీయడం ప్రారంభించాయి అతని కళ్లు అర్థం కాక.



"మిత్రుడు కామేశ్వరరావుకి,

నీ మిత్రుడు శ్రీను వ్రాయునది.

నేను బాగానే ఉన్నాను. నీకు ట్రాన్స్‌ఫర్ అయిన ఊరు ఎలా ఉంది అని అడిగావు పోయిన ఉత్తరంలో. బాగానే ఉంది. కానీ అక్షరాస్యత చాలా తక్కువ. బాగా వెనుకబడిన ఊరు, పిల్లలకు పాఠాలు చాలా కష్టపడి చెప్పవలసి వస్తోంది.

ఇక నా సంగతి అలా ఉంచితే కోకిల, నువ్వు ప్రేమించుకొంటున్నట్లు మీ కాబోయే మామగార్కి అంటే కోకిల తండ్రికి చెప్పకపోయావా. కోకిల కూడా నిన్ను ఇష్టపడుతోంది కదా అటువంటప్పుడు ఇబ్బందేమిటి? అటువంటి మంచి అమ్మాయి నీకు మళ్లీ దొరకదు. ఇప్పటికే మీ నాన్నమ్మ తొందరపెడుతోంది కదా! కాబట్టి నీవు ఈ విషయంలో తొందరగా ఓ నిర్ణయానికి రావడం మంచిదని నా అభిప్రాయం.

అన్నట్టు రాయడం మరిచాను. మొన్న శనివారం శాంతి ఊరి నుండి వచ్చింది.

ఇంతే సంగతులు

ఇట్లు

నీ మిత్రుడు శ్రీను"

"ఇదేంటి ఈ లెటరు నీ దగ్గరకు ఎలా వచ్చింది? అంతా కన్ఫ్యూజన్‌గా ఉంది" అన్నాడు అర్థం కాని మొహం పెట్టి.

"ఓసి పిచ్చిమొద్దూ! మీ ఫ్రెండు శ్రీను నీకు రాసిన లెటర్ ఇది. దీన్ని మా నాన్న చూశాడు. అందులో మనం ప్రేమించుకొన్న విషయం రాసి ఉంది. అది చూసిన మా నాన్న మీ ఊరు వెళ్లి మీ ఇంట్లో వాళ్లతో మాట్లాడి మన ఇద్దరికి పెళ్లి కుదిర్చారు. దాని ఫలితమే మీ నాన్నమ్మ ఈ రిప్లయ్ లెటర్. ఆ రోజు ఊరెళ్లింది సంబంధం కోసమని చెప్పాను కదా! ఆ ఊరు మీ ఊరే. ఆ సంబంధం మీ సంబంధమే. నిన్ను సర్‌ప్రైజ్ చేద్దామని దాచాను ఈ విషయం" అంది కోకిల కొంటెగా కళ్లు ఎగురవేస్తూ.

"అమ్మ నా కోకిలా" అంటూ బాహువుల్లో బంధించాడు.

"అవునూ.. మీ నాన్నేంటి పరాయి ఉత్తరాలు చూడటం. పోనీలే చూడటం మంచిదే అయింది" అన్నాడు కామేష్ ఆమె కురులలో తలని ఒదిగిస్తూ.

"అదేం కాదు, మీ ఫ్రెండ్ రాసిన ఉత్తరం ముందుగా నా చేతిలో పడింది. బాగా ఆలోచించి దాన్ని మా నాన్నకి కనిపించే విధంగా నేను మా ఇంట్లో టేబుల్‌పై పెట్టాను. నువ్వు ఎలాగు మన ప్రేమ గురించి మా నాన్నతో చెప్పలేవు కదా!" అంది కోకిల.

"ఎంత మంచి పనిచేశావు కోకిల. అసలు మీ నాన్న నీకు కోకిలకు బదులు ఏ జిత్తులమారి నక్క అని పెట్టి ఉంటే బావుండేది" అన్నాడు కామేశ్ చెవిలో గుసగుసగా.

"ఏయ్..." అంటూ చెంప మీద ఒక్కటిచ్చింది.

అదే...ముద్దు.

"అవన్నీ శ్రావణమాసంలో.." అన్నాడు అది చూసిన వాళ్లనాన్న వెనుక నుంచి.

సిగ్గుల మొగ్గలు అయ్యారు కామూ, కోకిల.

○

## కేరట్ బ్యూటీ

బాలీవుడ్ భామ కత్రినా కైఫ్ గ్లామరే గ్లామరు అంటారు చాలామంది. మరి అంతటి అందాలరాశి- అందంలోని రహస్యం ఏంటి అని సందేహం వ్యక్తపరిచేవాళ్లూ వుంటారు కదా! ఆ మాటే మనం అడిగామనుకోండి- 'అబ్బే ఏం లేదండీ?' అనేస్తుంది. అలాకాదుగానీ ఇంకో మాట చెప్పండీ అని మళ్లీ అడిగామనుకోండి- 'నిజంగానే చెబుతున్నాను, రోజుకో కేరట్ తింటానండీ, అంతే ఇంకే ప్రత్యేక జాగ్రత్తలూ తీసుకోనండీ' అంటూ ముసిముసి నవ్వులు విసురుతుంది. అంటే కత్రినా కేరట్ బ్యూటీ అన్నమాట.

